# పట్టు పరికిణీ



గోడమీది గడియారం టంగు టంగుమని ఏడుగంటలు కొట్టింది. డిసెంబరు నెల. చలి ఇంకా తగ్గలేదు. ఎండ బాగా రాలేదు. అవచ్చీ రాని ఎండలో వరండాలో పడకుర్చీలో కూర్చుని పేపరు చదువుకొంటున్నాడు మోహన్ రావు.

'నాన్నా, నా కొత్త పట్టు పరికిణీ బాగుందా?' అంటూ పరిగెత్తుతూ వచ్చింది కూతురు రాణి.

రాణికి ఆరేళ్ళు నిండాయి. ప్రొద్దుటే లేచి తలంటుకుంది. పుట్టిన దినం కోసమని కుట్టించిన కొత్త పట్టు పరికిణీ, జాకెట్టు వేసుకుంది. మెళ్ళో బంగారం గొలుసు. చేతులకి బంగారం గాజుల మధ్య వేసుకున్న గాజు గాజులు గలగలా చప్పుడు చేస్తున్నాయి. వేసుకున్న జూకాలు ఆ పిల్ల తల తిప్పినప్పుడల్లా కదులుతున్నాయి. జడ వేయకుండా వదిలేసిన జుట్టు గాలి కెగురుతోంది. కళ్ళల్లో పడకుండా జుత్తు అడుగునుంచి రిబ్బను తీసి తల పైన అందంగా పువ్వులా కట్టింది; నాన్నమ్మ. వాటిని కళ్ళు తిప్పుతూ, సంతోషం పట్టలేకపోతూ వచ్చిన కూతుర్ని ప్రేమగా ఒళ్ళో కూర్చోపెట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు మోహన్.

'బాగుందమ్మా, చాలా బాగుంది. పెళ్ళికూతురులా ఉన్నావు తల్లీ' అన్నాడు మెళ్ళో గొలుసు సరి చేస్తూ.

'ఛీ, నాన్నా' అంటూ అచ్చు పెళ్ళికూతురిలాగే సిగ్గుపడింది రాణి.

'నిజం, పుట్టిన రోజు పెళ్ళికూతురివి కదూ' అన్నాడు నవ్వుతూ.

ఒళ్ళోంచి దిగిపోతున్న కూతుర్ని 'ఎక్కడికి వెళ్ళిపోతున్నావు' అని అడిగాడు.

'పక్కింటి పిన్నిగారికి, ఎదురింటి అమ్మమ్మగారికి పరికిణీ చూపించి రమ్మంది అమ్మ' అంది రాణి జాకెట్టు క్రిందికి లాక్కుంటూ.

'జాగ్రత్తగా వెళ్ళు' అని ఆ పిల్ల మెట్లు దిగిందాకా చూసి మళ్ళీ పేపర్లో పడ్డాడు మోహన్.

పిన్నిగారికి, అమ్మమ్మగారికి పరికిణీ చూపించి వాళ్ళు మెచ్చుకున్నాక ఇంటికి వచ్చింది రాణి. ఆ పిల్లకింకా తృప్తి తీరలేదు. ఇంకా ఎవరికి చూపిద్దామా అని ఆలోచించి పెరట్లోకి పరుగెత్తింది.

'రామీ, ఒసే రామీ నా పట్టు పరికిణీ బాగుందా? నా పుట్టిందోజని అమ్మ కుట్టించింది' అంటూ

అంట్లు తోముతున్న పనిమనిషి దగ్గరికి తెళ్లింది.

'చాలా బాగుందండమ్మాయ్‌గోరూ' అంది రామి.

ఆ ప్రక్కనే నించునివున్నది రామి కూతురు లక్ష్మి. రాణితోటిదే అది కూడా.

'ఎంత బాగుందో ! మెరిసిపోతుంది, ఏం దండమ్మాయ్‌గోరూ?' అంటూ పరికి ముట్కుకు చూసింది. 'ఎంత మెత్తగుందో?' అంటూ ఆశ్చర్యపోయింది.

అంతలోకే 'ఇదుగో రామి ఈ వెండి గ్లాసులు తెల్లగా తోమి ఇయ్యి' అంటూ పెరట్లోకి వచ్చింది రాణి తల్లి సుశీలమ్మ. రామిని, రాణి పరికిణీ చూస్తున్న లక్ష్మినీ చూసింది.

'ఛీ, దాని మురికి చేతుల్తో పరికిణీ ముట్టుకోనియ్యకు. ఇంట్లోకి పద' అని కూతుర్ని కసిరి, 'ఏమే రామీ, నీకేనా బుద్ధి లేదుటే, చూస్తూ వూరుకున్నావు' అని దానిమీద విసుక్కుని కూతుర్ని తీసుకుని లోపలికి వెళ్లిపోయింది.

ఆ పిల్ల వెళ్లినవైపే చూస్తూ ఆ పరికిణీ అందాన్ని, మెత్తదనాన్ని తలుచుకుంటో నిలబడింది లక్ష్మి. 'ఎంత బాగుందో ఆ పరికిణీ. అంచుమీద ఏమో పిట్టలుండాయి. జరిగ మెరిసి పోతంది. ముట్కుకుంటే ఎంత మెత్తగుంది. నాకూ అలాటి పరికిణీ ఉంటే!' అనుకుంది లక్ష్మి ఆశగా.

ఆ రాత్రి అమ్మ పెట్టిన అన్నం తినేసి కాసేపు 'అ, ఆ లు' రాసుకుని కళ్లు నులుముకుంటూ అమ్మ ప్రక్క గోనె పట్టామీదికి చేరింది లక్ష్మి.

'అమ్మా' అంది వచ్చే నిద్దర ఆపుకుంటూ.

'ఏటే!' అంది ఏమో ఆలోచిస్తున్న రామి.

'మరే, మరే'

'ఏటే?' అంది కూతురివైపు తిరుగుతూ.

'ఇయ్యాల చిన్నమ్మాయ్‌గారి పుట్టింరోజు కాదటే!'

'అవును. అందుకే అమ్మగారు పాయసం వండారు, అంది సాయంత్రం తోమిన గిన్నెల్లో పాయసం గిన్నె జ్ఞాపకం రాగా రామి.

'మరి నా కెప్పుడూ పుట్టింరోజు రాదేమే? నా పుట్టింరోజెప్పుడూ?' ప్రొద్దుటనుండీ ఆలోచిస్తున్న లక్ష్మి ఆలోచన తెగక అడిగేసింది.

'పిచ్చి, గొప్పోలకయన్నీ మన కేటి?' అంది రామి.

'అసలు ఎప్పుడూ?' పట్టు పట్టింది లక్ష్మి.

'కనుపు..... కాదు..... కాదు.... ముక్కనుమునాటావు' అంది రామి గుర్తు తెచ్చుకుంటూ.

'మరే ఈసారి నాకూ పుట్టిం రోజు సెయ్యవే' ముద్దుగా అడిగింది తల్లి రొమ్ములో తల దాచుకుంటూ.

'అలాగేలే' అంది రామి. 'తలంటిపోస్తే పోతాదిలే' అనుకుంటూ.

'మరే అమ్మాయ్‌గోరి పరికిణీలాంటిది కావాలే' అంది తల్లి కింకా దగ్గరగా జరుగుతూ. ఆ పరికిణీ దాని పసి హృదయంలో ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. కళ్లు మూసుకున్నా, తెరచినా అదే కనబడుతోంది. చేతి కింకా మెత్తగా తగులుతున్నట్లే ఉంది.

'అబ్బో-అది చానా ఖరీదుంటాది. పట్టుబట్టలు మన కెక్కడొత్తాయి? అయన్నీ కావాలనుకోకూడదు' అంది రామి కూతురి కోర్కెకి ఆశ్చర్యపోతూ

'పోనీలేవే అమ్మా. పాతదన్నా! అమ్మగార్ని అడగవే. అది ఎంత బాగుందో తెలుసా. మెత్తగుంటది. అడగవే' అంది ఏడుపాపుకుంటూ.

రామికి జాలి వేసింది. పిచ్చిపిల్ల. 'సిన్నది దానికేటి తెలుద్ది. కట్టం సుకం. అక్కడకీ ఎప్పుడూ సూసిన యన్నీ కావాలని అడగదు. అసలు నోరిడిచి ఏమీ అడగనే లేదింతవరకూ. దాని కెంత మనసేసిందో. అల్లా అయ్యే ఉంటే ఎట్టో అట్టా కానిక పొయ్యేవాడా' అనుకుంది.

'అలాగే, సూద్దాంలే అని కూతుర్ని సముదాయించింది రామి.

పట్టు పరికిణీ కొనిచ్చినట్లే సంతోషిస్తూ నిద్దట్లో ఒరిగిపోయింది లక్ష్మి.

రామి చనిపోయిన భర్తని తలచుకొని, 'అడే ఉంటే' అనుకుంది.

* * *

రామిభర్త వెంకన్న ప్రెస్సులో పని చేసేవాడు. ప్రొప్రైటరింట్లో పని చేస్తున్న రామిని చూసి మనసు పడి మనువాడేడు. సుఖంగా, సంతోషంగా కాలం గడిపే వాళ్లిద్దరూ. రెండేళ్లు గడిచినా పిల్లలు పుట్టక పోయేసరికి వెంకన్నకి దిగులు పట్టుకుంది ఇంక పుట్టరేమోనని. పిల్లలంటే

ఒక అమెరికన్ పాప భగవంతుణ్ణి ప్రార్థిస్తోంది.

ఓ దేముడా! అమ్మని కాపాడు నాన్నని కాపాడు అందర్నీ కాపాడు! అన్నట్లు మర్చేపోయా! అందరికన్నా ముందు నిన్ను నువ్వు కాపాడుకో లేకపోతే మేం చచ్చిపోతాం.

సీతారామయ్య (చిలువూరు)

వల్లమాలిన ఇష్టం వాడికి. మూడో సంవత్సరం గడుస్తూండగా రామి నీళ్లోసుకుంది. వెంకన్న సంబరం అంతా ఇంతా కాదు. రామిని పువ్వుల్లో పెట్టి చూసుకున్నాడు. వంట కూడా చెయ్యనిచ్చేవాడు కాడు.

కూతుర్ని కంది రామి. 'నా ఇంటి కిది లచ్చిమి' అంటూ లక్ష్మి అని పేరు పెట్టాడు. ఇంటి దగ్గిరున్నంతసేపూ క్షణమన్నా నేల దింపేవాడు కాడు. 'నా తల్లిని పెద్ద సదువు సదివిస్తా. ఉద్యోగ సేపిస్తా. నీలా అంట్లు తోముద్ది అనుకున్నావు కావాల' అనేవాడు.

వెంకన్నకి ప్రెస్సులో 60, 70 రూ. వచ్చేవి. ఆపైని వీలున్నప్పుడల్లా 'ఎక్స్‌ట్రా టైం' చేసేవాడు. సంవత్సరానికి రెండు నెలల జీతం బోనస్సు వచ్చేది. రామి రెండిళ్లల్లో పని చేసి రెండు పదులు తెచ్చేది. ఉన్న చిన్న గుడిసెలో సంసారం చీకూ, చింతా లేకుండా హాయిగా గడిచిపోయేది.

కాని ఎంతోకాలం ఆ అదృష్టం నిలవలేదు. కాలికి మేకు గుచ్చుకుని అది పుండయ్యి, ధనుర్వాతంవచ్చి మూడు నాళ్లలో చచ్చిపోయాడు వెంకన్న. అప్పటికి [illegible] దేవుంచినా ప్రయోజనం లేకపోయింది. ప్రైవేటు [illegible] నవ్వ్రహా లేదు. తన్ను నమ్ముకున్న రామినిగాని, తన ప్రేమాలన్నీ పెట్టుకు పెంచిన లక్ష్మినిగాని కనీసం పలకరించకుండానే కన్ను మూశాడు.

మూడు నెలల వరకూ కోలుకోలేకపోయింది రామి. ఆ తర్వాత పిల్లను చూసుకొని గుండె దిటవు చేసుకుంది. దీనికోసమే నే బతికేది, అనుకుంది. అప్పటినుండీ ఆ రెండిళ్లడనీ చేసుకుంటూ వాళ్ళు పడేసే పట్టెడన్నంతో పొట్ట నింపుకుంటూ ఎలాగో కాలం వెళ్లదీస్తున్నాది. కూతుర్ని చదివించాలన్న వెంకన్న కోర్కె తీర్చాలన్న ఆశతో లక్ష్మిని బడికి పంపిస్తోంది. కాని ఆ చదువెంతకాలం సాగుతుందో దానికే తెలియదు.

* * *

ఈ తలపుతోనే గడిపింది రాత్రంతా. కునుకు పట్టిందో లేదో తొలి కోడి కూత వినిపించి చట్టున లేచి పోయింది. పిల్ల దానిమీద చిరుగు బొంత బాగా కప్పి, గుడిసె తలుపు చేరవేసి పనిలోకి బయలుదేరింది రామి.

* * *

యాంత్రికంగా అంట్లు తోముతోందేగాని, దాని ఆలోచనలన్నీ పిల్లదాని కోరిక మీదనే ఉన్నాయి. 'ఎఱ్ఱి మాలోకం తెలిసో తెలవకో అడిగింది. ఎట్టన్నా ఇయ్యగలిగితే' అనుకుంది.

కూతురి సంతోషం చూడాలని ఏ తల్లికుండదు!

పని అంతా అయ్యాక 'నే వెల్తన్నానండమ్మగోరూ' అని చెప్పి ఇంకా హాల్లో నిల్చుంది రామి.

'వెళ్ళు' అని ఇంకా అలాగే నిల్చుని ఉందని గమనించి, 'ఏం అలా నిలబడ్డావ్' అంది సుశీలమ్మ.

'అమ్మగోరూ, నిన్న చిన్నమ్మాయ్‌గోరు కట్టుకున్న పరికిణీ ఎంతవుద్దండీ?' అని అడిగింది నెమ్మదిగా.

'అదా? అబ్బో! చాలా ఖరీదు. అరవై అయిదు రూపాయలు' అంది నిజానికది ఏభయ్యే అయినా.

'అమ్మో! అంత కరీదే!!' గుండె చేత్తో కొట్టుకుంది రామి.

'ఎందుకడిగావు?' కుతూహలంగా అడిగింది సుశీలమ్మ

'పిల్లది సర్దా పడిందండమ్మగారూ, దానికీ పుట్టింరోజు చేసి అట్టాటి చిలుకు పరికి కట్టాలట' అంది. ఏదో తప్పు చేసిందానిలాగ సిగ్గుపడుతూ

'సరిపోయింది. మింగ మెతుకు లేదటగాని, మీసాలకి సంపెంగ నూనెట. తిండానికి తిండిలేదుగాని పుట్టింరోజులూ, వేషాలు' అంది సుశీలమ్మ మనసులో అనుకున్నట్లు పైకే.

రామి కుంచించుకు పోయింది. అయినా అభిమానాన్ని అవతలకి నెట్టి,

'అమ్మా, చిన్నమ్మాయ్‌గోరిది సిరిగిపోయింది ఏమన్నా చిలుకు పరికిణీ ఉంటే ఇయ్యండమ్మా. కుర్రది చానా ఆప పడతావుంది' అని అడిగింది.

'నా దగ్గిరేం లేవు సుమా. ఏం? సిల్కు పరికిణీ లేకపోతే పుట్టింరోజు గడవనందా' అంది పెద్ద జోక్ వేసినట్లు నవ్వుతూ.

చిన్నబుచ్చుకుంది రామి. 'నా వెల్తానండమ్మగారూ', అనేసి గబగబా బయటకి వెళ్లిపోయింది.

ఈ సంభాషణ అంతా ప్రక్క గదిలోంచి వింటున్న మోహన్ గబగబా బయటకి వచ్చి

'ఆదేం, సుశీలా, మొన్ననేగా రాణి పట్టు పరికిణీలో ఒకటి పాతపై పోయిందనీ, మరొకటి నువ్వు బద్ద

కంగా పడేస్తే తక్కు దక్కుడా చిలకలు కొరికేయని పాత బట్టల పెట్టెలో పడేశావు. పాపం ఒకటి ఇవ్వలేకపోయావా? పిల్ల ఎంత మనసుపడి అడిగిందో' అన్నాడు.

'సారి. సామెత చెప్పినట్లే ఉంది. ఇవాళ పరికిణీ ఇస్తే రేపు నాపట్టుచీరె అడుగుతుంది. అయినా ఏం? పెద్దవాళ్లతో సరిగ్గా తూగాలంటే ఎలా? ఎవరికి తగ్గట్లు వాళ్లుండాలిగానీ పరికిణీలకి బోల్డు జరీ ఉంది. ఏ స్టేన్‌లెస్‌స్టీలు గిన్నెల వాడి కిచ్చినా కళ్ల కద్దుకుని పది రూపాయలు చేసే గిన్నె ఇస్తాడు!' అంది సుశీలమ్మ.

'ఏం? ఇంట్లో వాడకానికని ఇంటినిండా పెట్టినవీ, పాపాయ్ పెళ్లినాటికని పెట్టెండా దాచినవీ చాలావూ? ఆ ఒక్క పరికిణీ ఇచ్చి కొనకపోతే మనకు గడవదూ?' అన్నాడు కొంచెం కోపంగా.

'ఇదిగో! మీ రెన్ని చెప్పండి. ఆ పరికిణీ దానికివ్వడం అనవసరం. అనవసరంగా మప్పిపెట్టడం. లేనివాళ్లు లే నట్లుండాలి ఆ పట్టు పరికిణీ లేకుండా దాని పుట్టి(న్రోజు గడవదేమో చూస్తాను' అంటూ ఇంక ఈ వాదన అనవసరం అన్నట్లు లేచి లోపలికి వెళ్లిపోయింది సుశీలమ్మ.

మోహన్‌కి నిజంగా కోపం వచ్చింది. 'నేనే పాతది కొని ఇద్దునా' అని అనుకున్నాడు. మళ్లీ అంతలోనే 'నా కెందు కొచ్చింది? దాని పరికిణీ కోసం వారం రోజులు ఇంట్లో యుద్ధం చెయ్యాలి మూతి విరుపులూ, దెప్పి పొడుపులూ పడాలి' అని తన ధర్మ గుణాన్ని అదుపులో పెట్టుకున్నాడు శాంతి కాముకుడు మోహన్.

*　　　*　　　*

'అమ్మా! అడిగావటే పరికిణీ?' ఇంటికెళ్లగానే రామి నడిగింది లక్ష్మి.

'ఆ! అడగడం అయింది. నాలుగు చెప్పు దెబ్బలు తినటం అయింది. ఇక నోరు మూసుక్కూకో' అంది రామి. సుశీలమ్మ ఎత్తి పొడుపులు దాని చెవుల్లో రింగుమంటున్నాయి.

'అయితే నాకు పట్టు పరికిణీ లేదా?' ఏడుపు లంకించుకుంది లక్ష్మి.

# పట్టు పరికిణీ

'ఛీ. నోర్మూయ్యి. పట్టు పరికిణీ కావాలట పట్టు పరికిణీ' అంటూ నాలుగు తగిలించింది రామి ఇంకేం చెయ్యలేక.

గుడ్లలో నీళ్లు కుక్కుకుంటూ ఆశ విడుచుకోలేక ఒక మూల కెళ్లి నిల్చుంది లక్ష్మి.

కూతుర్ని చూస్తూఉంటే కడుపు తరుక్కుపోయింది రామికి. దగ్గరగా తీసుకుని 'నా తల్లే. ఏడవకు. నా సేతు లిరగా. ఎట్టా గొట్టానో. నీమీద కోపం సూపించాను. మీ అయ్యే ఉంటే,' అంటూ తనూ కన్నీరు పెట్టుకుంది.

'నువ్వేడవకే అమ్మా. నాకు పరికిణీ వద్దు లేవే. ఎప్పుడూ అడగను' అంది లక్ష్మి వెక్కుతూ, తన చిన్ని చేతులతో తల్లి కళ్లు తుడుస్తూ.

'ఛీ. పాడు బతుకులు. జల్మానికోనాడన్నా పిల్లల కోర్కె తీర్చలేని జీవితాలు. ఎవరినన్నా ధర్మం చెయ్యమన్నా ఎక్కిరింపులూ, ఏలాకోలాలు. ఉన్నోళ్లకేగాని లేనోళ్లకి ఆసలూ, పేమలూ ఉండవనుకుంటారు ఆళ్లే మడుసులూ, మేం కానట్లు' అనుకుంది రామి.

ఆ రాత్రి రామికి నిద్దర పట్టలేదు. కూతురు కోర్కె తీర్చడానికి మార్గం ఏమిటా అని ఆలోచిస్తూ గడిపేసింది తెల్లార్లూ.

మర్నాడు సాయంత్రం పనులు ముగించుకుని బట్టల షాపుకి వెళ్లింది.

'పట్టు గుడ్డలున్నయ్యా పరికిణాలకి?' అంది మొహమాట పడుతూ.

'ఆ! బోలె డున్నాయి. ఎన్ని కావాలి?' లేని వాళ్లని చూస్తే అందరికీ హాస్యమే.

'ఎట్టాగిత్తారు?'

'యాభై,అరవై,డభ్భై. ఎంతఖరీదులోకావాలి?'

'అమ్మో' అనుకుంది. 'సవకలో లేవా?'

'మహా కొనేసేటట్టే వాకబు చేస్తున్నావే. గజం 5 రూ. కి నాసిరకం సిల్కు ఉంది. పరికిణీకి 16 రూ. అవుతుంది. అంతకు తక్కువ మా దగ్గ రుండవు,' అన్నాడు షావుకారు విసుక్కుంటూ.

'పదా (రూపాయలే' అనుకుంటూ తనలో తనేదో గొణుక్కుంటూ ఇంటి కొచ్చేసింది రామి.

'పదా(రూపాయ లెక్కణ్ణుంచా(టూను? పోనీ అమ్మగార్ని అప్పుగా ఇచ్చి, జీతంలో ఇరకోసుకోమందామన్నా మొన్న వానలకి ఇల్లు పడిపోయినప్పుడు ఈయమ్మకాడో నలబై, ఆయమ్మకాడో నలబై అట్టుకొచ్చానాయె. నెలకి మూడేసి రూపాయ లిరక్కోసుకునేట్టుగా. దానికే కాలా వేలా పడాల్సి వచ్చింది. ఏకలనున్నాదో అప్పటికైనా ఇచ్చిందా సుశీలమ్మ. మా లచ్చమ్మకాడుంటే పరికిణి ఇచ్చునేవోగాని ఆవిడకి పిల్లల్లేరు పాపం. పిల్ల ఆశ పడ్డాది. ఎట్టాగో ఇద్దామంటే నా వల్లకాందే నా నేటిసేయను' అని పరిపరివిధాల తలపోసిందిరామి.

*　　　*　　　*

మాట నిలబెట్టుకుంది లక్ష్మి. మళ్లీ పరికిణీ మాట ఎత్తలేదు. మనసులో కోర్కె మనసులోనే దాచుకుంది. వయసులో చిన్నదే అయినా కొన్ని కోర్కెలు కోరరానివి అని దాని హృదయంలో నాటుకుపోయింది. 'నే నడుగుతే అమ్మ ఏడుత్తాది అమ్మేడుత్తే నాకూ ఏడు పొత్తాది. పరికిణి వద్దు, ఏం వద్దు' అనుకుంది దాని మనసులో.

*　　　*　　　*

వీధిలో స్టీలు గిన్నెల వాడి కేక వినపడి 'వాణ్ణిలా పిలవ్వేరామీ' అని పురమాయించి పాత బట్టల దగ్గిర కెళ్ళింది సుశీలమ్మ.

గిన్నెలవాడు వచ్చి అరుగుమీద దింపుకున్నాడు బుట్ట. రామి, లక్ష్మి అక్కడే నిల్చున్నారు.

సుశీలమ్మ వస్తూనే 'నీ పనయిపోతే వెళ్ళు ఏం, అలా నిలబడ్డావు?' అంది.

'పోతాను లెండమ్మా' అందేకాని అక్కడే నిల్చుంది రామి, మిల మిల మెరిసిపోతున్నా గిన్నెలు చూస్తూ.

సుశీలమ్మ ఒక్కొక్క చీరా, పేంటూ చూపిస్తూ గిన్నెలు బేరమాడుతోంది. చివరికి రెండుపట్టు పరికిణీలు చూపించి,

'ఈ రెండింటికీ ఈ గిన్నె ఇయ్యి' అంది ఒక పెద్ద సైజు గిన్నె చూపిస్తూ.

రామి పరికిణీలవంక ఆశ్చర్యంగా చూసి 'పెద్దోల్లు కూడా అబద్ధా లాడతారు' అనుకుంది.

'ఆ పరికిణీలకి గిన్నె వత్తాదా అమ్మగోరూ, తెలీనట్టు అడుగుతున్నారు' అన్నాడు వాడిగ్గా ఇచ్చే గిన్నెలవాడు.

'ఎందుకురాదు. ఎంత జరీ ఉందో చూశావా? ఆ గిన్నె ఆరూ(పాయలకన్నా ఎక్కువ చెయ్యదు. నాకు తెలీనట్లు చెప్తావేంటి?' అంది సుశీలమ్మ.

'ఆ(రూపయలకే ఇంత పెద్ద గిన్నె వత్తాదా. ఆ జరీ అంతా కరిగిస్తే నిండా రెండు తులాల వెండి రాదు. పరికిణాల పాలంగా అమ్మితే రెండింటికీ కలిపి అయిదు రూపాయ లొస్తాయో రావో. ఇదిగో ఈ చిన్నగిన్నె కావలిస్తే తీసుకోండి అంతకన్నా ఇవ్వలేను' అన్నాడు.

'సరే పోనీ ఈ జాకెట్టు కూడా తీసుకుని దానిమీద మూత కూడా ఇయ్యి!'


గునుస్తూనే ఇచ్చేశాడు రెండూ.

సుశీలమ్మ కొన్న గిన్నెలు చూసుకు మురిసిపోతూ, లోపలి కెళ్లిపోయింది. గిన్నెలవాడు బట్టలు మూట కట్టుకుంటున్నాడు.

రామి ఆఖరి (ప్రయత్నం చేయదల్చుకుంది.

'అన్నా ఆ పరికిణీ ఎంతవుది' అంది బెరుగ్గా.

'ఏది? ఈ పట్టుదా?'



'నాల్గు రూపాయలు'

'రెండూ కలిపి అయిదు కూడా చెయ్యావని ఇప్పుడేగా అమ్మగారితో అన్నావు' కొంచెం ధైర్యంగా అడిగింది.

'బాగుంది. అలా అనకపోతే ఏపారం ఎలా చేస్తాన్నూ?' తెలిగ్గా సమర్థించుకున్నాడు.

**'నాకు ఆ పరికిణీ కావాలి. ఈ పస్టుకి వస్తే రెండు రూపాయలు, మళ్ళా పస్టుకివస్తే రెండు రూపాయలూఇచ్చేత్తాను. ఇత్తావా?' బతిమాలింది.**

'సారి! ఈ నాలుగు రూపాయలకి రెండుసార్లు తిరగాలన్నమాట. ఈ పస్టుకోసారి, మల్లా పస్టుకో సారి!' విసుక్కుంటూ బట్ట ఎత్తుకోబోయాడు.

'ఎల్లిపోకన్నా. పిల్లది పుట్టిం రోజుకి కావాలని ఆస పడతాఉంది. ఆడముండని ఎక్కడ్నించి తేను. ఆల్ల అయ్యేవుంటే ఈపాటి క్కొత్తది తెచ్చియ్యక పొయ్యేవాడా? ఆ బగమంతుడు ఆడ్నె గ్గీసి నన్నెత్తుకెల్లికోపోయినా బాగుండేది.'

'దీనికి పట్టు పరికిణీ కావాల్సి వచ్చిందా?' అన్నాడు తల్లి వెనకాల నిల్చున్న లక్ష్మిని ఇవతలికి లాగుతూ.

'ఆ! చిన్నమ్మాయ్ గోరు కట్టుకున్న రోజు నుంచీ అదే దేస అయిపోయింది. అమ్మగార్ని అడిగితే లేదు పొమ్మన్నారు. కొట్లో పదా రూపయలకి తక్కువలేదుట. మన వల్లకాదని మొన్న కూక లేశాను. నోరు నొక్కుకుంది. నువ్వు కనికరం సూపిస్తే నీ పేరు సెప్పుకుని సంతోసంగా తొడుక్కుంటాది. లేదంటే ఆ పాత సిరుగ్గుడ్డే. ఏవో! దాని మనసు తీరసాలన్న కోరిక్కొద్దీ అడిగాను!' అంది తన బాధనంతా వెళ్లబోస్తూ రామి.

లక్ష్మివైపు తదేకంగా చూశాడు గిన్నెలవాడు. ఏమనుకున్నాడో ఏమో. మూట విప్పి చిరుగుల్లేని పరికిణీతీసి దాని చేతిలో పెట్టి 'పుట్టిం రోజు పండగనాడు కట్టుకుని మా మావ ఇచ్చాడని అందర్తో చెప్పు' అన్నాడు దాని బుగ్గ గిల్లుతూ.

లక్ష్మి కళ్లు సంతోషంతో మెరిసిపోయాయి. కాని తల్లి ఏమంటుందోనని తీసుకోనా, వద్దా అన్నట్టు చూసింది.

'ఊరికే ఇయ్యొద్దన్నా. పస్టు కొచ్చావంటే రెండు రూపాయ లిచ్చేత్తాను. లేకపోతే నువ్వు రావద్దులే. మీ ఇల్లెక్కడో సెప్పు. నానే అట్టు' కొచ్చి ఇచ్చేత్తాను. నాలుగూ రెండు మాట్లుగా.

'ఏమీ ఇవ్వక్కర్లేదులే. ఎందుకో ఈ బుల్లిని చూత్తాఉంటే సచ్చిపోయిన నా కూతురు గేపకం వస్తా ఉండాది. పిచ్చిది. ఎక్కడుందో. ఇప్పుడుంటే ఇలాగే ఉండును. రోజూ నానుగిన్నె లమ్ముకొని ఇంటి కెల్తావుంటే 'అయ్యా' అని నా కెదురొత్తా సూసుకోకుండా కారుక్రింద పడి అక్కడే సచ్చిపోనాది. ఎదవ ముండావాణి సూత్తూ కూడా ఏటీ సెయ్యలేక పోయాను' కళ్లనీళ్లు తుడుచుకున్నాడు. 'అదే అడిగితే అమ్ముకుంటానందునా! ఇయ్యకపోదునా? దాని లాటిదే ఇదీ. మరేటనుకోకునీ అన్నే ఇచ్చాడనుకో. ఎల్తొత్తాను.మరిసిపోకు?' అని రామి సంభ్రమాశ్చర్యాలనుండితేరుకునేలోగాబుట్ట నెత్తుకునివెళ్ళిపోయాడు.

కంటికనిపించేంతవరకూ అతను వెళ్ళిన వైపె చూస్తూ నిల్చుని తమ ఇంటి దోవ పట్టారు తల్లీ, కూతురూ.




# పట్టు పరికిణీ

## 23 వ పేజీ తరువాయి

కాని మనసులో లక్ష లక్షల ఆలోచనలు, ఖావాలూ మెదుల్తున్నాయి. లక్ష్మి సంతోషం కట్టలు తెంచుకున్నది. మాటి మాటికీ పరికిణీ వంక చూసుకుంటూ, దాన్ని హృదయాని కత్తు కుని మురిసిపోతోంది. అది తొడుక్కుంటే తనెలా ఉంటుందో, తన నేస్తాలంతా ఏమంటారో ఊహిం చుకుని ఉత్సాహం పట్టలేక పోతోంది. ప్రపంచాన్ని జయించినట్లూ, ఆకాశంలోని చందమామ తన సొత్తైనట్లూ ఉంది. దాని ప్రాణానికి. ఆ వెలసిన పరికిణీ తనదయితే.

సందుమలుపులో ఆఫీసునుండి వస్తున్న మోహన్ ఇద్దర్నీ చూశాడు. లక్ష్మి చేతిలో పరికిణీ చూసి,

'పాపం. బయటికి అలా ఉంటుందిగాని దాని మనసు మెత్తనే. నాతో వాదించినా పరికిణీ ఇచ్చే సిందే. ఆ పిల్ల సంతోషం పట్టలేక పోతోందని చెప్పాలి సుశీలతో, అనుకున్నాడు తన భార్యే ఇచ్చి ఉంటు దని నిర్ధారణ చేసుకుని.

ఇంట్లో అడుగు పెడుతూనే.

'మంచి పని చేశావు అయినా నాకు తెలియదూ నువ్వు చాలా జాలి గుండె దానివని. ఇయ్యనంటూనే రెండిటిలో మంచిదిచూసి ఇచ్చావు' అన్నాడుభార్యతో.

'ఏమిటండీ మీరనేది' అంది ఆశ్చర్యంగా. అర్థం కాక. గిన్నెలవాడు పరికిణీ ఇవ్వడం ఆమె చూడలేదు.

'అదే పట్టు పరికిణీ లక్ష్మికి ఇచ్చావుకదూ. నేను సందు మొగలో చూశాను. నా దగ్గిరెందుకు దాస్తావు. నేనూ సంతోషిస్తానుగా. ఆ పిల్ల పాపం ఎలా మురిసిపోతుందో తెల్సా' అన్నాడు సుశీల కళ్ల ల్లోకి చూస్తూ. తనను ఆశ్చర్య పర్చడానికి ఆమె ఏమీ తెలియనట్లు నటిస్తోందని అతగాడి నమ్మకం.

ఇంతలోవీధిలోంచివచ్చిన రాణి ఈ మాటలువిని,

'అమ్మ ఇయ్యలేదు నాన్నా. సుశీల అమ్మగారు అది ఇచ్చి గిన్నె కొంది. గిన్నెలవాడు ఆ పరికిణీ లక్ష్మి కిచ్చేశాడు ఉత్తినే. డబ్బు వద్దన్నాడు కూడా' అంది కళ్లు తిప్పుతూ.

గతుక్కుమన్నాడుమోహన్. అయితేసుశీలమనసు మార్చుకొనిఇవ్వలేదన్నమాట. గిన్నెకొంటూనిఊరుకో లేదు.

'వాడే నయం మనకంటే. తినడానికి లేకపోయినా జాలి హృదయ మున్నాయి' అన్నాడు కుర్చీలో కూలబడుతూ.

'అవునులెండి. అలాగే అనండి. మీ కంటికి నేనో రాక్షసిని. నాకు హృదయం ఎలా ఉంటుంది? జాలి ఎలా ఉంటుంది. ఈ రాతి గుండె దాన్నెందు కట్టుకున్నారు!' అంటూ ఆరంభించింది. సుశీలమ్మ కళ్లు వత్తుకుంటూ, ముక్కు తుడుచుకుంటూ.

అమ్మ ఎందు కేడవాల్సి వచ్చిందో అర్థంకాని రాణి ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తూ నిల్చింది. ★

---

# మనిషి - మిథ్య

## 19 వ పేజీ తరువాయి

"పిల్లందరూ నాతోపాటు ఈవేళే ఆఫీసులో చేరారు" అన్నాడు.

మృణాళిని పకపకా నవ్వింది. ప్రసాదరావు తలం చేత్తో తడుంకున్నాడు. మిగిలిన ముగ్గురూ కంగారు పడ్డారు.

"చాలా బాగుంది బావా నీ పరిచయం. పరిచయం చేసే పద్ధతి ఇదేనా ? నన్నిక్కడే గుమ్మాని కవతలే నిలబెట్టి—"

"సారీ .... లోపలికి రా" అన్నాడు ప్రసాదరావు.

"వీరు శంకరం, వీరు వాసుదేవరావు, వీరు లక్ష్మీపతి, మృణాళిని మా మావయ్య కూతురు" అని పరిచయం చేశాడు.

"మావయ్య వచ్చారా ?" అడిగాడు ప్రసాద రావు.

"ఇంకా రాలేదు."

"అబ్బే, ఏంలేదు. మా వాళ్లకి అద్దెకో పోర్షను కావాలని అంటేనూ, మావయ్య కేమైనా తెలు స్తుందేమోనని ....."

"అరగంటలో రావచ్చు."

"వొచ్చేస్తారు. సరేనండి. ఆయనొచ్చేవరకూ మనం యిక్కడే కూర్చుందాం. ఆయనొచ్చిం తర్వాత ఆ విషయమేదో చూద్దాం" అన్నాడు ప్రసాదరావు.

మృణాళిని గుమ్మం దాటుతూ బావా అని పిలి చింది. బావకి పిలుపు వినిపించలేదు. ఆపిల్ల వెళ్లి పోయింది. అతను గోడమున్న కేలండర్ల ప్రాము ఖ్యత వివరించాలనే ఉద్దేశ్యంతో అన్నీ శ్రద్ధగా చూశాడు. ఒక కేలండరు చేతిలోకి తీసుకున్నాడు.

"ఇదిగోనండి, ఇది ఓ టాయిలెట్ సోప్ కేలండరు. దీంట్లో వైజయంతిమాల అందంగా ఉందిగదూ. అన్నట్టు గురూగారూ—నిజంగా వైజయంతిమాల యీ—సబ్బునే వాడుతుం దంటారా ? లేకపోతే—"

హాల్లో నుంచుని మృణాళిని ఈమాటు కాస్త గట్టిగా 'ప్రసాదం' అని పిలిచింది. ఆ పిలు పుతో అతను చెప్పబోయేది ఆగిపోయింది. కేలం డరు పుచ్చుకునే మృణాళిని దగ్గిరి కెళ్లాడు. మళ్లా కాసేపటికి వొచ్చి, కేలండరు టీపాయ్ మీద పెట్టి,

"జస్టెమినిట్. ఇప్పుడే వస్తాను. ఈలోగా మీరు మాటాడుతుండండి" అన్నాడు గది దాటుతూ.

ముగ్గురూ మెల్లిగా నవ్వుకున్నారు.

"సందడి చేస్తున్నాడు" అన్నాడు లక్ష్మీపతి.

"బాధ్యతలు నెత్తిన పడేంతవరకూ సందడి చేస్తూ గడపడం చాలామందికి ఉన్న లక్షణమే" అన్నాడు వాసుదేవరావు.

"అతనివల్లనైనా యిల్లు దొరికితే బాగుండును. అన్నాడు శంకరం.

మరో పది నిముషాల్లో దాదాపు డ్యాన్సు చేస్తు న్నట్టు నడుస్తూ కాఫీలు పట్టుకొచ్చాడు. ప్రసాద రావు. ముగ్గురికీ కాఫీలిచ్చి చేతులు దులుపు కుంటూ—

"నేను మీకు కాఫీ యివ్వలేదని కోప్పడింది మృణాళిని. మీరేమీ అనుకోవద్దు. మరిచిపోయాను. అంతే."

"చాలా శ్రమనిస్తున్నాం" అన్నాడు వాసు.

"మృణాళినికి కాఫీ కాయడమంటే వక్కపొడి నోట్లో వేసుకున్నంత పని. మా అత్తయ్య ఉంటే ఇవన్నీ ఆవిడే చూచుకునే దనుకోండి. ఆవిడేమో ప్రస్తుతం మా ఊళ్లో ఉంటుంది. ఇంటిపను లన్నీ మృణాళిని నెత్తిమీద పడ్డాయి. ఆడపిల్లయి పుట్టిన తరువాత— ఏమంటారు ? ఇంటి పనులూ, వంట పనులూ తప్పనిసరిగా నేర్చుకోవాలిగా" ఈ కాసిని మాటలూ ముగిసిన వెంటనే ప్రసాదరావు చూపు మళ్లా కేలండర్ పైన పడింది. వెంటనే నిద్దా తీసుకుని,

"ఇంతకీ వైజయంతిమాల ఆ సబ్బునే వాడు తుందాని అనుమానం" అన్నాడు ప్రసాదం.

"అయ్య బాబోయ్ — మీరా విషయం వదలి పెట్టండి బాబూ — ఆవిడే సబ్బు వాడితే మన కేవిటిలేండి" అన్నాడు లక్ష్మీపతి.

"అహ. మాటవరసకి అడుగుతున్నా. వాళ్ళు వాడేది ఒహటి చెప్పే దొహటీను."

"నేనూ మాటవరసకి అంటూన్నా—ఎస్ మార్కు బీడీల కేలండర్లెప్పుడైనా చూశారా ? దానిపైన మరి మన ...." లక్ష్మీపతి మాట ముగి యకముందే ప్రసాదం ఘొల్లున నవ్వేస్తూ,

"చంపారు గురూ .... ఇదీ ఒక పాయింటే సుమా హ .... హ .... హ ...." అన్నాడు ప్రసాదం.

అతన్ని చూచి అందరూ నవ్వుకున్నారు. సరిగ్గా అదే సమయానికి ప్రసాదం మావయ్యగారు వచ్చారు. ప్రసాదరావు సక్రమమైన పద్ధతిలో అక్కడున్న వాళ్లందర్నీ వాళ్ల మావయ్యకి పరిచయం చేశాడు. తర్వాత వాళ్ళు వచ్చిన పనీ చెప్పాడు. ఆయన రెండు నిముషాలు ఆలోచించి, ప్రసాదరావుకి కొన్ని గుర్తులు చెప్పి, ఆ యింటికి వెళ్లి కనుక్కో మన్నారు.

గంపెడాశతో బయటపడ్డారు మిత్రులు. ఆయన చెప్పినిల్లు చూడగానే బావుందనిపించింది. చిన్న డాబా ముందు అందమైన కాంపౌండునూ. లక్ష్మీపతి లోపలికెళ్లి ఇంటివారిని పిలిచి అద్దె విషయం అడిగాడు. ఆ యింటాయన అడిగిన ప్రశ్న లకి జవాబుచెప్పి బయట కొచ్చాడు.

"ముప్పైఫై రూపాయలు అద్దెట. నయాపైసా గూడా తగ్గేది లేదని ఖరారుగా చెప్పేడు. ఒప్పు కున్నాను. ఒక పది రూపాయలు అడ్వాన్సుగా యిచ్చి ఈవేళే చేరుతున్నామని చెప్పి వచ్చాను" అన్నాడు లక్ష్మీపతి.

ఆరోజే ఇంట్లో దిగేరు మిత్రులు.

* * *

రోజులు దొర్లుతున్నాయి.

ఆఫీసులో పరిస్థితులు రోజురోజుకీ అధ్వా న్నంగా తయారవుతున్నాయి. అందరూ 'నలుగురి' పైన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నారు. వాళ్ళు చేసిన ప్రతి పనికీ వేలెట్టి చూపిస్తున్నారు. ఏమి జరిగినా 'ఈ కొత్తవాళ్లతో వచ్చిన చిక్కే యిదండి. మనం చెపితే వినరు. వాళ్లకి తోచదు. చస్తున్నాం వీళ్లతో' అని విసుక్కుంటున్నారు.

తెలియంది అడుగుతే సరిగ్గా చెప్పడం అటుంచి మొహం చిట్లించుకోడంలాటి పిచ్చి పనులు చేస్తు న్నారు. చాటుగా 'కొత్త సన్నులు వట్టి దద్ద మ్మలు సుమా !' అని గూడా అనుకుంటున్నారు.

ఆఫీసరు యివన్నీ పట్టించుకోడు. ఆయనకి కావలసింది పని. అంతేగాని, అవతలవాడు చస్తు న్నాడా, బ్రతుకుతున్నాడా, వాడి చుట్టూ ఉన్న పరి